భారతి సిమెంట్ ఆధ్వర్యంలో అన్నదానం



మేడిపల్లి: శ్రీరామనవమి సందర్భంగా పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి వీరాంజనేయ స్వామి దేవాలయంలో శ్రీరాముని కల్యాణం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా భారతి సిమెంట్, సవేర ఏజెన్సీస్ మేడిపల్లి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

కుషాయిగూడ: సామాజిక భావనతో వేసవిలో దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఈసీఐఎల్ చౌరస్తాలో బుధవారం సోలీస్ కంటి ఆసుపత్రి ఆవరణలో ఆసుపత్రి ఎండీ వీరాంజనేయులు తల్లిదండ్రులు వెంకయ్య, తులిశమ్మల జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. సమాజానికి తనవంతుగా సాయం చేయాలనేది గొప్ప గుణమని ప్రతి ఒక్కరూ దీన్ని అలవర్చుకోవాలన్నారు. మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, కాసం మహిపాల్‌రెడ్డి, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపునకు కృషి చేయాలి



శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొన్న పట్నం సునీతామహేందర్‌రెడ్డి

బోడుప్పల్: నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని ఆ పార్టీ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డి అన్నారు. బోడుప్పల్ మారుతీనగర్‌లోని దాసాంజనేయ స్వామి ఆలయంలో బుధవారం జరిగిన శ్రీరామనవమి వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలను ప్రజల్లోకి తీసుకెళ్లి విస్తృత స్థాయిలో ప్రచారం చేయాలన్నారు. కాంగ్రెస్‌పార్టీపై రోజురోజుకు ఆదరణ పెరుగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్, బోడుప్పల్ అధ్యక్షులు పోగుల నర్సింహ్మారెడ్డి, కార్పొరేటర్లు బొమ్మక్ కల్యాణ్‌కుమార్, తోటకూర అజయ్‌యాదవ్, పులకండ్ల హేమలత జంగారెడ్డి, సింగిరెడ్డి పద్మారెడ్డి, సుమన్ నాయక్, బి–బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, నేతలు యాదగిరి, గుర్రాల వెంకటేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

కుషాయిగూడ: క్రీడలతో మానసికోల్లాసం సొంతమవుతుందని ఐలా చైర్మన్ జక్కా రోషిరెడ్డి అన్నారు. మే డేను పురస్కరించుకుని చర్లపల్లి ఇండస్ట్రియల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రీడాపోటీలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోటీల్లో గెలుపోటములు సహజమన్నారు. క్రీడలు శారీరక ధారుద్యంతో పాటుగా స్నేహభావం పెంచేందుకు దోహదపడతాయన్నారు. నిత్యం పనిఒత్తిడిలో ఉండే కార్మికులకు క్రీడాపోటీలు ఉత్తేజం నింపుతాయన్నారు. యూనియన్ అధ్యక్షుడు బీవీ. సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, ఎం. శ్రీనివాసరావు, కొండల్‌రెడ్డి, రాజు, వికాస్, పవన్, గణేష్, వెంకటేష్ తదితరులున్నారు.

ప్రత్యేక పూజలు



అల్వాల్: అల్వాల్ రాంనగర్ కాలనీలోని సాయిబాబా దేవాలయంలో కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో వేణుగోపాల్, బబ్లూ, వరలక్ష్మి, మల్లేష్‌గౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, ప్రేమ్‌కుమార్, వీఎస్.రాజు, గిరి, అరుణ్, సందీప్, వెంకటేష్, రాజేందర్, లింగారెడ్డి, జార్జ్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



ఉప్పల్ మినీ శిల్పారామంలో..

ఉప్పల్: శ్రీరామనవమి ఉత్సవాల సందర్భంగా ఉప్పల్ మినీ శిల్పారామంలో బుధవారం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. నాట్య గురువు పద్మకల్యాణ్ ఆధ్వర్యంలో సంచలన స్కూల్ ఆఫ్ డాన్స్ శిష్య బృందం సీతాస్వయంవరం కూచిపూడి నృత్య రూపకాన్ని ప్రదర్శించి మెప్పించారు. శ్రీరాముడు, సీత జననం, వానవాసం, తాటకి సంహారం తదితర అంశాలను కళాకారులు ప్రదర్శించి అలరించారు.

ఉప్పల్ గణేష్‌నగర్‌లో స్వామివారి కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు



బ్రాహ్మణ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో జరిగిన కల్యాణానికి హాజరైన మర్రి రాజశేఖర్‌రెడ్డి



రామంతాపూర్ సత్యదేవుని ఆలయంలో కార్పొరేటర్ శ్రీవాణి దంపతులు



అల్వాల్ హెచ్‌ఎంటీనగర్‌లో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి దంపతులు



కమనీయం.. రాములోరి కల్యాణం



ఉప్పల్/ మల్కాజ్‌గిరి జోన్ పరిధిలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బుధవారం ఉదయం నుంచి పలు ఆలయాలు, విధులు, గేటెడ్ కమ్యూనిటీల్లో సీతారాముల కల్యాణమహోత్సవం కనులపండువగా జరిగింది. ప్రజా ప్రతినిధులు, ప్రముఖులు కల్యాణోత్సవానికి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.

- ఉప్పల్/ మల్కాజ్‌గిరి జోన్ల బృందం



పీర్జాదిగూడ ఆంజనేయస్వామి ఆలయంలో ఎమ్మెల్యే మల్లారెడ్డి తదితరులు



కార్పొరేటర్ రజిత పరమేశ్వర్‌రెడ్డి



సీతారాముల దర్శనం



మేడిపల్లిలోని అనురాధ అపార్ట్‌మెంట్ బ్లాక్ -సి లో..



ఐ.ఎస్‌నగర్ ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో..



గౌతంనగర్‌లో..



అన్నదానం చేస్తున్న కార్పొరేటర్ సునీతాచంద్రశేఖర్



రామంతాపూర్ శివాలయంలో..



ఆనంద్‌బాగ్ దేవాలయంలో మైనంపల్లి, అభ్యర్థి సునీతారెడ్డి



కన్యకాపరమేశ్వరి దేవాలయంలో కార్పొరేటర్ శ్రవణ్



మౌలాలి డిఫెన్స్ కాలనీ యూత్ ఆధ్వర్యంలో..



వసంతపురి కాలనీలో..



పీర్జాదిగూడలో సీతారాముల కల్యాణంలో కాంగ్రెస్ నేతలు



బోడుప్పల్ రెడ్డికాలనీలోని పులకండ్ల బాల్‌రెడ్డి ఆర్కేడ్‌లో..



కల్యాణమహోత్సవానికి హాజరైన భక్తులు



మందుముల పరమేశ్వర్‌రెడ్డి, బొంతు శ్రీదేవి తదితరులు

వాటర్ ప్లాన్ రెడీ

ఎక్కడా తాగునీటికి ఇబ్బందులు లేకుండా..

- 13 పురపాలక సంఘాలు, 61 గ్రామాల్లో చర్యలు
- ప్రతి మూడు డివిజన్లు, వార్డులకు ఒక ట్యాంకర్
- ప్రతి గ్రామంలో అదనంగా రెండు ట్యాంకర్లు
- అవసరమైతే అద్దెకు వ్యవసాయ బోర్లు

సాక్షి, మేడ్చల్ జిల్లా: నగర శివారుల్లోని 13 పురపాలక సంఘాలు, 61 గ్రామాల్లో నీటి ఎద్దడి నివారణకు పక్కా యాక్షన్ ప్లాన్ రూపొందించిన అధికార యంత్రాంగం అమలుకు చర్యలు తీసుకుంటోంది. ఓఆర్ఆర్(లోపలి) పరిధిలోని పురపాలక సంఘాలు, గ్రామాల్లో నీటి సమస్య పరిష్కారానికి జలమండలి ప్రత్యేక చర్యలు తీసుకుంటుండగా, వీటితో సహా మిగతా పురపాలక సంఘాలు, గ్రామ పంచాయతీల్లో జిల్లా అధికార యంత్రాంగం యాక్షన్ ప్లాన్‌తో ముందుకెళ్తోంది.

నీటి ఎద్దడిని నివారించేందుకు..

నగర శివారులోని జవహర్‌నగర్, బోడుప్పల్, పీర్జాదిగూడ, నిజాంపేట నగరపాలక సంస్థలతో పాటు కొంపల్లి, మేడ్చల్, దుండిగల్, గుండ్లపోచంపల్లి, తూముకుంట, నాగారం, దమ్మాయిగూడ, పోచారం, ఘట్‌కేసర్ మున్సిపాలిటీల పరిధిలోని మూడు డివిజన్లు/వార్డులకు ఒక వాటర్ ట్యాంకర్‌ను కేటాయించటంతో పాటు నీటి ఎద్దడి నివారణకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. అవసరాన్ని బట్టి ప్రైవేట్ వాటర్ ట్యాంకర్లు కూడా అందుబాటులో ఉండేలా యాక్షన్ ప్లాన్ రూపొందించింది. అలాగే, ప్రైవేట్ కమర్షియల్ బోర్లతో పాటు పట్టణానికి సమీపంలో గుర్తించిన వ్యవసాయ బోర్లను కూడా ఉపయోగించేలా కార్యాచరణ ప్రణాళిక ఖరారు చేసింది.

మండుటెండల నేపథ్యంలో..

నీటి సరఫరా పర్యవేక్షణకు పురపాలక సంఘాల కమిషనర్లతో సహా ప్రతి మూడు డివిజన్లు/వార్డులకు ఒక ప్రత్యేక అధికారిని జిల్లా కలెక్టర్ గౌతమ్ నియమించారు. వీరంతా జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్)అభిషేక్ అగస్త్య నేతృత్వంలో పనిచేసేలా చర్యలు తీసుకుంటున్నారు. మండుటెండల నేపథ్యంలో పడిపోతున్న భూగర్భ జలాలను దృష్టిలో పెట్టుకుని గ్రేటెడ్ కమ్యూనిటీ కాలనీలు, అపార్టుమెంట్లలో నీటి ఎద్దడిని నివారించేందుకు ప్రైవేట్ కమర్షియల్ ట్యాంకర్లు అందుబాటులో ఉండేలా కార్యాచరణ రూపొందించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అధిక జనాభా కలిగి ఉన్న జవహర్‌నగర్ కార్పొరేషన్‌తో సహా పురపాలక సంఘాల్లో నీటి సమస్య తలెత్తకూడదన్న లక్ష్యంతో యాక్షన్ ప్లాన్ అమలు చేస్తున్నట్లు అధికార యంత్రాంగం పేర్కొంటోంది.

పంచాయతీల్లో పకడ్బందీగా చర్యలు

నగర శివారుల్లో అర్బన్, సెమీఅర్బన్‌గా విస్తరిస్తున్న 61 గ్రామ పంచాయతీల్లో నీటి ఎద్దడి నివారణకు కలెక్టర్ ఆదేశాలతో జిల్లా పంచాయతీ శాఖ ప్రత్యేక చర్యలకు పూనుకుంటోంది. 61 పంచాయతీల్లో 160 ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకులతో పాటు 61 వాటర్ ట్యాంకర్లు ఉన్నప్పటికీ, ప్రతి గ్రామానికి అదనంగా రెండేసి చొప్పున వాటర్ ట్యాంకర్లను అందుబాటులో ఉంచినట్లు డీపీఓ వెంకయ్య తెలిపారు. వచ్చే జూన్ వరకు నీటి ఎద్దడి నివారణకు ఏ, బీ, సీ యాక్షన్ ప్లాన్‌ను రూపొందించిన పంచాయతీ శాఖ అవసరాన్ని బట్టి అద్దెకు తీసుకునేందుకు 169 వ్యవసాయ బోర్లను గుర్తించింది. ఇందులో ఘట్‌కేసర్ మండలంలో 38 వ్యవసాయ బోర్లు, కీసరలో 12, ఎంసీపల్లిలో 32, శామీర్‌పేటలో 45, మేడ్చల్ మండలంలో 42 వ్యవసాయ బోర్లు అద్దెకు తీసుకునేలా చర్యలు తీసుకుంటోంది. ఈ నేపథ్యంలోనే వ్యవసాయ బోర్లు ఉన్న భూములు సర్వే నంబర్లతో సహా రైతుల ఫోన్ నంబర్లు తదితర వివరాలను జిల్లా పంచాయతీ శాఖ సేకరించింది.

మండలానికో ప్రత్యేకాధికారి

నీటి సరఫరా పర్యవేక్షణ కోసం మండలానికో ప్రత్యేకాధికారిని కలెక్టర్ నియమించారు. శామీర్‌పేట మండలానికి ప్రత్యేక అధికారిగా డీపీఓ కొండా వెంకయ్యను నియమించగా, ఎంసీపల్లి మండలానికి డీపీఎల్‌ఓ వి.సాంబిరెడ్డి, మేడ్చల్ మండలానికి జెడ్పీ డిప్యూటీ సీఈఓ నీరజా, కీసర మండలానికి జెడ్పీ సీఈఓ ఎస్.దిలీప్‌కుమార్, ఘట్‌కేసర్ మండలానికి డీఆర్డీఏ ఎం.సాంబశివరావులను ప్రత్యేక ఆఫీసర్లుగా నియమించారు. కలెక్టర్ ఆదేశాలతో గేట్‌వాల్వ్స్, పైప్‌లైన్ల లీకేజీలను అరికట్టడంతో పాటు తాగునీటి సరఫరా తదితర విషయాలపై ప్రతి మూడు రోజులకు ఒకసారి సంబంధిత శాఖలతో పాటు ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తున్నారు.

ఆలోచించి ఓటు వేయండి !

సేవ కోసమే రాజకీయాల్లోకి రావాలన్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి



పూజా కార్యక్రమంలో సునీతా మహేందర్‌రెడ్డి

మల్కాజిగిరి: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. బుధవారం ఆనంద్‌బాగ్‌లోని తన కార్యాలయంలో పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి వార్ రూమ్‌ను పార్టీ అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'కాంగ్రెస్ పార్టీది బ్రతుకు బ్రతికించు అనే నినాదమని బీఆర్ఎస్ పార్టీలా దోచుకొనే సంస్కృతి లేదన్నారు'. 4 నెలల్లో సీఎం సమర్థవంతంగా ఐదు పథకాలను అమలు చేశారన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఐఏఎస్, ఐపీఎస్‌లు మచ్చతెచ్చారని ఆరోపించారు. డబ్బు సంపాదన కోసమే రాజకీయాల్లోకి రావొద్దని హితవు పలికారు. ఓటమితో తాను బాధపడనని ప్రతి ఓటమి విజయానికి పునాదిగా ఉంటుందన్నారు. ఈ ఎన్నికల్లో సునీతామహేందర్‌రెడ్డిని గెలిపించాలన్నారు. మతంతో దేవుడితో రాజకీయాలు చేసిన వారు నాశనం అయిపోయారని ఆ రాజకీయాలు వద్దన్నారు. కేంద్రంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడుతుందని ధీమా వ్యక్తం చేశారు. మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గాన్ని గెలిచి రేవంత్‌రెడ్డికి కానుకగా ఇవ్వాలన్నారు. హైదరాబాద్ యునైటెడ్ తమిళ్ సంఘం కాంగ్రెస్‌కు మద్దతు పలికారు. మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, నాయకులు హరివర్ధన్‌రెడ్డి, వజ్రేష్‌యాదవ్, కొలను హన్మంత్‌రెడ్డి, బండి రమేష్, శరత్‌చంద్రారెడ్డి, భూపతిరెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, శోభారాణి, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

కబేళాకు తరలిస్తున్న పశువుల పట్టివేత



ఘట్‌కేసర్: పశువులను కబేళాకు తరలిస్తున్న వాహనాన్ని ఘట్‌కేసర్ పోలీసులు బుధవారం పట్టుకున్నారు. సీఐ సైదులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సభావత్ విజయ్‌కుమార్ అనే వ్యక్తి మంగళవారం విజయవాడ సంతలో 44 ఆవులు, 36 ఎద్దులు(మొత్తం 80) కొనుగోలు చేసి కంటైనర్‌లో క్రూరంగా నిర్బంధించి తాళ్లతో కట్టివేసి బహదూర్‌పుర కబేళాలకు తరలిస్తుండగా ఘట్‌కేసర్ వద్ద బుధవారం పట్టుకున్నారు. అందులో అప్పటికే ఒక ఆవు మృతి చెంది ఉంది. డ్రైవర్ షమీ మహ్మద్, లేబర్ గంగరాజును అదుపులోకి తీసుకొని పశువులను జియాగూడలోని గోశాలకు పంపించారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.